మహిళతో కుప్పం కమిషనర్ నాగేశ్వరరావు

దారి సమస్య పరిష్కారంకోసం వచ్చిన బాధితురాలు

న్యాయం చేయమంటూ రోడ్డెక్కి ధర్నా

సీఐ శ్రీధర్ కూడా వేధించారంటూ ఆరోపణ



మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు

ధర్నా చేస్తున్న బాధితురాలు హిమబిందు

రాత్రి 9 గంటలకు ఫోన్ చెయ్!

కుప్పం, జూలై 6:

'నైట్ టైం ఫోన్ చెయ్యి, పర్లేదు. తొమ్మిది గంటలకు ఫ్రీగా ఉంటా'

'అవును నీకు 45 ఉంటాదా?'

బాధ్యత కలిగిన ఒక ప్రభుత్వాధికారి బాధిత మహిళతో చేసిన ఫోన్ సంభాషణలివి.

సొంత ఇంటికి దారి సమస్య పరిష్కారం కోసం ఆశ్రయించిన హిమబిందు అనే మహిళను రాత్రి తనకు ఫోన్ చేయడమనడమే కాకుండా, ఆమె వయసు గురించి ఆరా తీసిన ఆ పెద్దమనిషి కుప్పం మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు. మరో రెండేళ్లలో ఉద్యోగ విరమణ చేయనున్న ఆ అధికారి తనపట్ల ప్రవర్తించిన తీరు గురించి బాధిత మహిళ గతంలో ఆయనతో జరిగిన ఫోన్ సంభాషణ రికార్డును శనివారం బయట పెట్టింది. అంతేకాదు.. సమస్య పరిష్కారం కోసం పోలీసు స్టేషన్ మెట్లెక్కితే అప్పటి కుప్పం అర్బన్ సీఐ కూడా సమస్య తీర్చకపోగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడ్తానని బెదిరించినట్లు ఆమె ఆరోపించారు. బాధితురాలు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

కుప్పం మున్సిపాలిటీ 14వ వార్డు కొత్తపేట వినాయక వీధిలో హిమబిందు ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటోంది. ఆమె భర్త సోమశేఖర్ బెంగళూరులో పని చేస్తున్నాడు. వీళ్ల ఇంటికి దారి లేకుండా కొందరు స్థానికులు అడ్డుగా గోడ కట్టేశారు. ఒక ప్రైవేటు స్థలం నుంచి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. దీనిపై హిమబిందుతో పాటు ఆమె భర్త సోమశేఖర్ వేర్వేరుగా గతంలో మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావుకు, జిల్లా న్యాయసేవా సమితికి, పోలీసులకు అర్జీలు పెట్టుకున్నారు. ఫలితం కనిపించలేదు. ఏడాది క్రితం తమ ఇంటిముందున్న వ్యక్తులు దారిని ఆక్రమించి, గోడ కట్టడమే కాకుండా, ఇదేమని అడిగితే దాడులకు తెగబడుతున్నారని, వారినుంచి తనకు ప్రాణహాని ఉందని, కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో హిమబిందు ఫిర్యాదు చేశారు. సమస్య తీర్చకపోగా, ఎదురు ఆమెపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడ్తానని అప్పటి అర్బన్ సీఐ శ్రీధర్ బెదిరింపులకు దిగారు. ఆమె మూడునాలుగు నెలల క్రితం కుప్పం కమిషనర్ నాగేశ్వరరావును ఆశ్రయించారు. ఆయనకు అర్జీ పెట్టుకున్నారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ ఆమెను తరచూ కార్యాలయానికి రమ్మని చెప్పి, అసభ్యంగా ప్రవర్తించేవారు. సమస్య తీర్చే నెపంతో అప్పుడప్పుడూ ఫోన్లు చేసి, అసభ్యకరమైన సంభాషణ సాగించేవారు. పగలు బిజీగా ఉంటానని, అందువల్ల రాత్రి 9 తర్వాత ఫోన్ చేయమని చెప్పేవారు. అంతేకాక ఆమె వయసు గురించి, పిల్లల గురించీ ఆరా తీయడం చేసేవారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉండడం, దౌర్జన్యాలు, దాడులు ఎక్కువగా జరుగుతుండడం, అధికారులకు వైసీపీ నేతల నుంచి అండ ఉండడం వంటి కారణాల వల్ల బాధితురాలు హిమబిందు ఈ విషయం ఎవరితో చెప్పుకోలేక తనలో తనే కుమిలిపోయారు.

రోడ్డెక్కి ధర్నా: తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధితురాలిలో ధైర్యం వచ్చింది. శనివారం కుప్పం ఆర్టీసీ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహం ఎదుట ధర్నాకు దిగారు. గతంలో అధికారులు, దౌర్జన్యకారుల వల్ల తనకు జరిగిన అన్యాయం తెలిపే ప్లకార్డులు పట్టుకుని నిరసన దీక్ష చేపట్టారు. ఆమె మాట్లాడుతూ తమ ఇంటిముందున్న దళితులు కొందరు ఇంటికి వచ్చే దారికి అడ్డుగా గోడ కట్టి మూసేశారని చెప్పారు. పోలీసు స్టేషన్‌కు న్యాయంకోసం పోతే అప్పటి సీఐ శ్రీధర్ తనపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానంటూ బెదిరించారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు అయితే, సమస్య గురించి అడిగితే రాత్రి 9 గంటల తర్వాత ఫోన్ చేయమన్నారని, తన వయసు గురించి కూడా అడుగుతూ అసభ్యకరమైన సంభాషణతో వేధించారని ఆరోపించారు. సంబంధిత ఫోన్ సంభాషణ రికార్డును బయట పెట్టారు. చివరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలు హిమబిందుతో బలవంతంగా ధర్నా విరమింపజేశారు. న్యాయం చేస్తామని చెప్పి ఆమెను అక్కడినుంచి పంపించేశారు.

క్యాజువల్‌గా మాట్లాడా: మున్సిపల్ కమిషనర్

బాధిత మహిళ హిమబిందుతో క్యాజువల్‌గా మాట్లాడాను తప్ప, తనకు ఏ దురుద్దేశమూ లేదని మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు చెప్పారు. ఆయన ఆంధ్రజ్యోతికి వివరణ ఇస్తూ రెవెన్యూ సమస్య అని చెప్పినా ఆమె వినలేదన్నారు. పదేపదే ఛాంబర్‌కు వచ్చి డ్యూటీలో ఉన్నప్పుడు విసిగించేదన్నారు. ఎలక్షన్ల ముందు కావడంతో తాను బిజీగా ఉండి ఆమెను పట్టించుకోలేదని, ధర్నా చేస్తానని బెదిరించిందని చెప్పారు. అందుకే రాత్రి 9 గంటలకు ఫ్రీగా ఉన్న సమయంలో ఫోన్ చేస్తే సమస్య విని, పరిష్కారం చూస్తానంటూ చెప్పానన్నారు. ఎవరో తనను టార్గెట్ చేసుకుని ఇదంతా చేస్తున్నారని కమిషనర్ ఆరోపించారు.

హిమబిందుతో కమిషనర్ సాగించిన ఫోన్ సంభాషణలో కొంత భాగం

'నువ్వు వచ్చావు ఆ టైంలో. ఏమంటే నేను బిజీగా బిజీబిజీగా ఉన్న.

ఆ టైంలో కాదని నిన్ను పంపిచేశాను.'

'సార్..'

'నైట్ టైం ఫోన్ చెయ్ ఫర్లేదు. 9 గంటలకు ఫోన్ చెయ్, ఫ్రీగా ఉంటాను.'

'అంటే, అంతా సార్. చేస్తాను.'

'కన్ఫర్మ్..'

'ఆ, చేస్తాను సార్.'

'9 గంటలకు ఫోన్ చేస్తావా?'

'ఆ చేస్తాను సార్. ఆ రోడ్డు ప్రాబ్లమ్ కొంచెం చూడండి.'

'సర్వేయర్ మెయిన్ కీ. అతడిచ్చే రిపోర్ట్‌ను బట్టి బేస్ అయి ఉంటుంది.'

'ఓకే..'

'సర్వేయర్ వాళ్లకి లొంగకుండా గట్టిగా చెప్తారు.'

'ఓకే సార్.'

'నేను స్వయంగా ఆర్డీవోగారి పక్కన కూర్చుంటా. ఎలక్షన్స్ కదా, చెప్తా ఆయనకు కూడా.'

'ప్లీజ్ సార్.'

'అది హిమబిందు, మ్యాగ్జిమమ్ ఏ కండిషన్ లేకుండా చేశా నీకు..'

'థ్యాంక్యూ సార్.'

'ఇంకా ఏమన్నా చెప్పుకోవలసినవి ఏమన్నా ఉన్నాయా?'

'ఏవుంటాయ్ సార్, అంతే. కాకపోతే నాకు ఆ రోడ్డు ఇష్యూ..'

'నువ్వు అడిగినట్టు నేను మ్యాగ్జిమమ్ చేశా.'

'ఓకే.'

'ఇంకేం విషయం?'

'ఇంకేం లేదు సార్. చెప్పాలి సార్.'

'చిన్న పిలకాయలు ఇద్దరున్నారా ఇంట్లో?'

'ఉన్నారు సార్.'

'ఎంతుంటుంది నీకు? 45 ఉంటుందా?'

'లేదు సార్, 33.'

'సరే, సరే. రాత్రికి చెయ్యి ఫోను.'

'ఓకే సార్, చేస్తాను సార్.'



ఇకపై ఇసుక ఉచితం

- రేపటి నుంచే పంపిణీకి ఏర్పాట్లు
- జిల్లాలో సిద్ధంగా 2.82లక్షల మెట్రిక్ టన్నులు
- లోడింగ్, నిర్వహణ, ట్యాక్స్‌లకు రూ.155 వసూలు
- స్పష్టం చేసిన ప్రభుత్వం

సామాన్య ప్రజలకు ఇకమీదట ఇసుక కష్టాలు తప్పనున్నాయి. సోమవారం నుంచి ఉచితంగా అందించేందుకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు అమలు చేసిన ఇసుక పాలసీ సామాన్యులను అష్టకష్టాలకు గురిచేసింది. ఇసుకను ఆదాయ వనరుగా భావించి జిల్లాలోని రీచులన్నింటినీ జేపీ వెంచర్స్ అనే సంస్థకు అప్పగించేసింది. వారు ప్రజా కోణాన్ని పక్కనబెట్టి రీచుకో రేటు నిర్ణయించి, దోచుకున్నారు. ఇసుక పేరు చెబితేనే సామాన్యులు భయపడే పరిస్థితి వచ్చింది. అదే సమయంలో భవన నిర్మాణ రంగం కుదేలైంది. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అటు పేదల్లో, ఇటు భవన నిర్మాణ కార్మికుల్లో ఆశలు చిగురింపజేసింది. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● తీవ్ర కసరత్తు చేసి ధరల నిర్ణయం

ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రజలపై ఎలాంటి భారమూ పడకుండా నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుకను ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందించనున్నారు. లోడింగ్, నిర్వహణ, ట్యాక్స్ రూపంలో నామమాత్రంగా వసూలు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శనివారం కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర స్థాయి అధికారులు సూచించారు.

● మెట్రిక్ టన్ను రూ.155కే

జిల్లాలో ప్రస్తుతం 2.82లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. చిత్తూరు రూరల్‌లో రెండుచోట్ల, బైరెడ్డిపల్లె మండలంలో ఓ చోట ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. చిత్తూరులో ఉన్న రెండు స్టాక్ పాయింట్ల వద్ద మెట్రిక్ టన్ను ధర రూ.155గా, బైరెడ్డిపల్లె స్టాక్ పాయింట్ వద్ద రూ.191గా నిర్ణయించారు. ట్రాక్టరుకు 4.5 మెట్రిక్ టన్నుల ఇసుక పడుతుంది. చిత్తూరులో ఓ ట్రాక్టరు ఇసుక రూ.700లోపు, బైరెడ్డిపల్లెలో రూ.860కే లభిస్తుంది. ప్రభుత్వం వసూలు చేస్తున్న రూ.155లోనూ లోడింగ్‌కు రూ.30, స్టాక్ నిర్వహణకు రూ.20, పలు రకాల ట్యాక్సులకు రూ.88 ఇలా ఉంటాయే తప్పా. ఇసుకను మాత్రం ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తోంది.

● రేపటి నుంచే పంపిణీ.. డిజిటల్ పేమెంట్లు

ఇసుక కావాల్సినవారు డిజిటల్ పేమెంట్ల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. కలెక్టర్, మైనింగ్ శాఖ జిల్లా అధికారి పేరుతో జాయింట్ అకౌంట్‌ను తెరవనున్నారు. ఇందులోనే మొత్తం లావాదేవీలు జరగనున్నాయి. స్టాక్ పాయింట్ల వద్ద పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో వంటివారితో ఇసుక పంపిణీ చేయనున్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుక పంపిణీ జరుగుతుంది. రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నులు పంపిణీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. తొలుత ట్రాక్టర్లకే ప్రాధాన్యతనిస్తున్నారు.

● నిర్మాణ రంగానికి ఊపిరి

భవన నిర్మాణ రంగానికి సంబంధించిన 80 వేల మంది కార్మికులు జిల్లాలో ఉన్నారు. వైసీపీ అమలు చేసిన ఇసుక పాలసీతో ఆ రంగం కుదేలైంది. కార్మికులు పనుల్లేక రోడ్డున పడ్డారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో నిర్మాణ రంగానికి ఊతమొచ్చినట్లయింది.



పొరుగు రాష్ట్రాలకు తరలకుండా ఆపాలి

ఇల్లు కట్టుకోవడానికి ఇసుక అందుబాటులో లేకపోవడంతో డస్టును అధిక ధరకు కొనుగోలు చేస్తున్నాం. ప్రభుత్వం తాజాగా ప్రకటించిన ఉచిత ఇసుక విధానంతో పొరుగు రాష్ట్రాలకు ఇసుక తరలకుండా చర్యలు తీసుకోవాలి.

- మునిరాజా, పాపేపల్లి, వి.కోట మండలం



ఇంటి నిర్మాణాన్ని ఆపేశాం

గతంలో ఇసుక అందుబాటులో లేకపోవడం, ఒకవేళ ఉన్నా.. అధిక ధరలు చెల్లించలేక ఇంటి నిర్మాణాన్ని ఆపేశాను. ఇప్పుడు ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీ ప్రకటించడం సంతోషంగా ఉంది.

- అయ్యప్ప, నాగిరెడ్డిపల్లె, బైరెడ్డిపల్లె మండలం



మాకు పనిలేకుండా పోయింది

గతంలో ఇసుకను అధిక ధరకు విక్రయించడంతో పేద కుటుంబాలు ఇళ్ల నిర్మాణాల జోలికి వెళ్లలేదు. దీంతో మాలాంటి భవన నిర్మాణ కార్మికులకు పనిలేకుండా పోయింది. కుటుంబాలను పోషించడం కష్టంగా మారింది. కొత్త ప్రభుత్వ నిర్ణయంతో పనులుంటాయని ఆశిస్తున్నాను.

- శంకర్ గౌడ్, మేస్త్రీ, కిల్లారిపల్లె, గుడిపాల మండలం



కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయి

వైసీపీ ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణ కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయి.ఓ వైపు కరోనా, మరోవైపు ఇసుక విధానాలతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేకుండాపోయాయి. కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పాలసీతో ఇక మాకు పనులు దొరుకుతాయి.

- మల్లికార్జున, భవన నిర్మాణ కార్మికుడు, కల్లూరు, పులిచెర్ల మండలం

పుంగనూరులో ప్రభుత్వ రికార్డుల దహనంపై జడ్పీ సీఈవో విచారణ

● ఘటనా స్థలం పరిశీలన



రికార్డులు దహనం చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో గ్లోరియా

పుంగనూరు, జూలై 6: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరులో ప్రభుత్వ రికార్డుల దహనంపై శనివారం చిత్తూరు జడ్పీ సీఈవో గ్లోరియా విచారణ చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని శ్మశానం వద్ద గుర్తుతెలియని వ్యక్తులు సంచిలో రికార్డులు తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా దహనం చేశారనే విషయం పత్రికల్లో రావడంతో పట్టణంలో కలకలం రేగింది. విషయం తెలియగానే రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖల మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించి జడ్పీ సీఈవో గ్లోరియాను విచారణకు ఆదేశించారు. ఆమె సంఘటన స్థలంలో బూడిదైన కాగితాలు, పరిసరాలను పరిశీలించారు. మంటల్లో పూర్తిగా కాగితాలు కాలిపోగా అందులో కొన్ని క్యాలెండర్లు, పెళ్లిపత్రికలు కనిపించాయి. మిగిలిన పేపర్లు ఏంటనే విషయం తెలియరాలేదు. ఎంపీడీవో మునిరెడ్డి, ఈవోపీఆర్డీ నారాయణ, కార్యాలయ సిబ్బందిని ఈ విషయంపై ఆరా తీసి మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం మినిట్స్ బుక్, ఇటీవల కాంట్రాక్టు కంప్యూటర్ ఆపరేటర్ సునీల్ మండల సాధారణ నిధులు రూ.1.36 కోట్లు స్వాహా తదితర రికార్డులను సీఈవో తనిఖీ చేశారు. ఎంపీడీవో మునిరెడ్డి, ఎస్ఐ సుబ్బారెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

రికార్డులు దహనం కాలేదు : సీఈవో

ఎంపీడీవో కార్యాలయ రికార్డులు దహనం కాలేదని తమ పరిశీలనలో తెలిసినట్లు సీఈవో గ్లోరియా తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ మంటల్లో కొద్దిగా కాలకుండా ఉన్నవి పరిశీలిస్తే క్యాలెండర్లు, పెళ్లిపత్రికలు, జ్యుడిషియల్‌కు సంబంధించిన పత్రాలు ఉన్నట్లు తెలిసిందన్నారు. నిజంగానే ఎంపీడీవో కార్యాలయంలోని రికార్డులే దహనం అయివుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రికార్డులు ఆన్‌లైన్‌లో ఉంటాయని, ఎలాంటి ఇబ్బందీలేదని తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో సునీల్ అనే కాంట్రాక్టు ఉద్యోగి మండల సాధారణ నిధులు రూ.1.36 కోట్లు 20 విడతలుగా అతని సొంత బ్యాంకు ఖాతాలోకి ట్రాన్స్‌ఫర్ చేశారని, అందుకు కార్యాలయ పరిపాలనాధికారిణి రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డిలను సస్పెండ్ చేసినట్లు వివరించారు. నిందితుడు సునీల్ పరారీలో ఉన్నాడని, పోలీసులకు ఇదివరకే ఫిర్యాదు చేశామని, కేసు దర్యాప్తులో ఉందని పేర్కొన్నారు.

రికార్డులు దహనం చేసిన వారిని వదిలేదిలేదు : మంత్రి

పుంగనూరులో ఎంపీడీవో కార్యాలయ రికార్డులు దహనం చేసిన వారిని వదిలే ప్రసక్తేలేదని రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన శాఖా మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో ఫోన్‌లో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన తప్పులకు ఆధారాలు లేకుండా చెరిపేయాలని ప్రయత్నిస్తే ఊరుకునేదిలేదని, చట్టం తనపని చేసుకుంటుందన్నారు.

సీఐడీ విచారణ చేపట్టాలి : బీజేపీ

ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అవినీతి, అక్రమాలపై సీఐడీ అధికారులతో విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

తీర్థయాత్రలకు వెళుతూ.. కానరాని లోకాలకు

● బస్సు బోల్తాపడి ఇద్దరి మృతి

● 21 మందికి తీవ్రగాయాలు







బోల్తాపడిన బస్సు - మృతి చెందిన నరసింహారెడ్డి, రామాంజమ్మ

పెద్దపంజాణి, జూలై 6 : వారందరూ రెండు నెలల క్రితం కాశీయాత్రకు పోయి వచ్చారు. కాశీలో తెచ్చిన తీర్థ జలాలు రామేశ్వరంలో కలిపితే మోక్షం కలుగుతుందని అందరూ కలిసి రామేశ్వరానికి బస్సు మాట్లాడుకుని బయలుదేరారు. యాత్ర పూర్తికాకనే రోడ్డు ప్రమాదం రూపంలో ఇద్దరిని మృత్యువు తీసుకెళ్లిపోయింది. మరో 21 మంది తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యారు. మృతుల్లో ఒకరిది సత్యసాయి జిల్లాకాగా, మరొకరు కర్ణాటక రాష్ట్రం తుముకూరుకు చెందిన వారు. గంగవరం సీఐ కృష్ణమోహన్ వివరాల మేరకు.. సత్యసాయి జిల్లా పేరూరు, పరిగి, కర్ణాటక రాష్ట్రం తుముకూరు జిల్లా దమతమేరికి చెందిన 45 మంది సభ్యులు రెండు నెలల క్రితం 14 రోజుల కాశీ యాత్రకు పోయి వచ్చారు. కాశీలో తెచ్చిన తీర్థ జలాలు రామేశ్వరంలో కలిపితే మోక్షం కలుగుతుందనేది నమ్మకం. ఆ మేరకు కాణిపాకం నుంచి రామేశ్వరం వెళ్లేలా బస్సు మాట్లాడుకున్నారు. శుక్రవారం రాత్రి బయలుదేరిన బస్సు శనివారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో పలమనేరు-పుంగనూరు జాతీయ రహదారి పెద్దపంజాణి మండలం బసవరాజుకండ్రిగ సమీపంలోని కోళ్ల ఫారం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో సత్యసాయి జిల్లా చిన్నగువ్వలపల్లెకు చెందిన తిమ్మారెడ్డి భార్య రామాంజమ్మ(58), కర్ణాటక రాష్ట్రం తుముకూరు జిల్లా మురారాయనిహళ్లి గ్రామానికి చెందిన నరసింహారెడ్డి(68) అక్కడికక్కడే మృతి చెందారు. మరో 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. అందులో ముత్యాలమ్మ, క్లీనర్ శేఖర్, అంజమ్మ, శ్రీనివాసరెడ్డి, విజయగౌరి, లక్ష్మీదేవి, అంజనమ్మ, డ్రైవర్ అన్వర్, మరో లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు. స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108 అంబులెన్స్, స్థానిక ఆటోల సహాయంతో పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడ్డ వారిని మెరుగైన వైద్యం కోసం తిరుపతి, బెంగళూరు ఆస్పత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పలమనేరుకు తరలించారు. మృతురాలి తమ్ముడు మల్లికార్జునరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని క్షతగాత్రులు చెబుతున్నారు.



శునకానికి టీకా వేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్



జూనోసిస్ డే సందర్భంగా శనివారం చిత్తూరు పశుసంవర్థక శాఖ-బహువిధ పశువైద్యశాలకు వచ్చిన వివిధ రకాల శునకాలు అబ్బురపరిచాయి. ఇందులో డాబర్ మెన్, టెక్కల్ డాక్సీ ల్యాబ్, టెక్కల్ వీనర్ డాగ్, బసెన్జీ, సాస్ట్ డాగస్, జర్మన్ షఫర్డ్, పెట్ డాగ్స్ ఉన్నాయి. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ హాజరై యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

- చిత్తూరు (సెంట్రల్)

డ్వాక్రా మహిళలకు ఆర్పీ కుచ్చుటోపి

13 గ్రూపులకు చెందిన రూ.14.18 లక్షల స్వాహా ● మెప్మా అధికారుల మొద్దునిద్ర ● పోలీసులకు ఫిర్యాదుతో వెలుగులోకి

పుత్తూరు అర్బన్, జూలై 6:కంచే చేను మేసింది. రూపాయి...రూపాయి కూడబెట్టుకున్న మహిళల నగదును ఆర్పీ గద్దలా తన్నుకుపోయింది. డ్వాక్రా సంఘాలకు, మెప్మాకు మధ్య అనుసంధానకర్తగా ఉండాల్సిన ఆర్పీ (రిసోర్స్ పర్సన్) మహిళల కష్టార్జితాన్ని స్వాహా చేసింది. ఏకంగా రూ.14.18 లక్షల డ్వాక్రా సంఘాల నగదును సొంత అవసరాలకు వాడుకున్నా పసిగట్టలేని స్థితిలో పుత్తూరు మెప్మా అధికారులు ఉన్నారు. జరగాల్సిన నష్టం జరిగిపోయాక తీరిగ్గా ఆడిట్ పేరుతో ఏళ్లతరబడి కాలయాపన చేశారు. దీంతో బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పును చెల్లించాలని నోటీసులు అందుకున్న మహిళలు లబోదిబోమంటూ శనివారం పోలీసులను ఆశ్రయించారు.

కష్టార్జితం స్వాహా : బాధిత మహిళల కథనం మేరకు.... మున్సిపల్ పరిధిలోని ఆరేటమ్మ కాలనీ, ఎన్టీఆర్ కాలనీకి చెందిన డ్వాక్రా సంఘాలకు ఆర్పీగా భాగ్యలక్ష్మి పనిచేస్తున్నారు. 2016-2018 సంవత్సరాల మధ్య డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించి చెల్లింపులను తానే స్వయంగా బ్యాంకు వెళ్లి జమచేస్తానని నమ్మబలికి నగదు వసూలు చేశారు. అయితే బ్యాంకులకు చెల్లించకుండా ఆర్పీ భాగ్యలక్ష్మి ఆ నగదును తన సొంత అవసరాలకు వాడుకున్నారు. దీంతో పాటు మిగిలిన కంతులన్నీ ఒకేసారి జమచేస్తే కొత్తగా రుణాలు మంజూరు చేయిస్తానని చెప్పి రూ.లక్షల్లో వసూలు చేశారు. ఆఖరికి మహిళలు నెలానెలా జమ చేసే పొదుపు నగదును కూడా సంఘాల నుంచి అప్పుగా తీసుకుంది. 2020లో ఆరేటమ్మ కాలనీకి చెందిన నెహ్రూ సంఘానికి మంజూరైన రూ.3 లక్షల శ్రీనిధి సొమ్మును కూడా వాడేసుకోవడంతో ఆ గ్రూప్ సభ్యులు మెప్మా అధికారులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకి వచ్చింది. దీంతో పలువురు గ్రూప్ సభ్యులు కూడా తమకు జరిగిన అన్యాయంపై వరుసపెట్టి ఫిర్యాదులు చేశారు. దీంతో ఆర్పీ భాగ్యలక్ష్మి పరిధిలో ఉన్న 28 సంఘాల అకౌంట్లకు ఆడిట్ నిర్వహించారు. ఈ తంతు ఏడాది పాటు సాగింది. చివరగా మొత్తం 13 సంఘాలకు చెందిన రూ.14.18 లక్షల నగదు స్వాహా చేసినట్లు తేలింది. దీంతో గత ఏడాది ఆర్పీ భాగ్యలక్ష్మిని తాత్కాలికంగా విధుల నుంచి తప్పించారు. అయితే ఆమె స్వాహా చేసిన నగదును తిరిగి రాబట్టడంలో మాత్రం మెప్మా అధికారులు విఫలమయ్యారు. ఇటీవల బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను చెల్లించాలని నోటీసులు వస్తుండడంతో బాధిత మహిళలు న్యాయం చేయాలని శనివారం పుత్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



పుత్తూరు పోలీసు స్టేషన్ వద్ద బాధిత డ్వాక్రా మహిళలు

లోపభుయిష్టం మెప్మా పనితీరు

ఒక ఆర్పీ డ్వాక్రా సంఘాల నగదును రూ.లక్షల్లో స్వాహా చేస్తున్నా పసిగట్టలేని స్థితిలో పుత్తూరు మెప్మా అధికారులు ఉండడంపై తీవ్రస్థాయిలో విమర్శలు తలెత్తుతున్నాయి. నాలుగేళ్ల క్రితమే బయటపడినా సమస్యను మసిపూసి మారేడుకాయ చేయాలనే ప్రయత్నం చేశారు తప్ప తమకు న్యాయం చేయాలనే ఆలోచన మెప్మా అధికారులకు లేకుండాపోయిందని బాధిత మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల క్రితమే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించినా మెప్మా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. తమ నగదును తిరిగి ఇప్పించడంతో మెప్మాతో పాటు మున్సిపల్ అధికారులు కూడా బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా పుత్తూరు మెప్మాలో గూడుకట్టుకున్న నిర్లక్ష్యపు జాడ్యాన్ని వదిలించి పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తేగానీ వ్యవస్థ గాడిన పడదనే మాటలు వినిపిస్తున్నాయి.

జ్వరాలతో పడకేసిన తోటకనుమ

విష జ్వరంతో వివాహిత మృతి - చిన్నారి పరిస్థితి విషమం - ఇంటింటా డెంగ్యూ జ్వర బాధితులు

వి.కోట, జూలై 6: వి.కోట మండలంలోని తోటకనుమ గ్రామం జ్వరాలతో పడకేసింది. వారం రోజులుగా పల్లెలో ఇంటికొకరు చొప్పున జ్వరం బారినపడ్డారు. నాలుగు రోజుల క్రితం గంగరాజు కుమార్తె (8నెలలు) జ్వరం తీవ్రం కావడంతో చిన్నారిని కుప్పంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చిన్నారితో పాటు ఉంటున్న తల్లి స్వాతి (20) డెంగ్యూ బారినపడింది. పరిస్థితి విషమించడంతో ఆమెను మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. చిన్నారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.



తాగునీటి ట్యాంకు వద్ద మురుగునీటి గుంత

లోపించిన పారిశుధ్యం: గ్రామంలో తాగునీటి ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. అక్కడే తాగునీటి పైప్‌లైన్ లీకేజీకి గురై మురుగునీటి గుంతలు ఏర్పడ్డాయి. మురుగునీరు తాగునీటి పైపులైన్‌లో కలుస్తోంది. ఆ నీరు తాగి జ్వరాలు ప్రబలినట్లు తెలుస్తోంది. ఇక పల్లెలో చెత్త పేరుకుపోయింది. పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపానపోలేదని గ్రామస్తులు విచారం వ్యక్తం చేశారు.



గ్రామంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

వివాహిత మృతిపై విచారణ

జ్వరంతో వివాహిత మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎంపీడీవో గోవర్ధన్ గ్రామంలో విచారణ చేపట్టారు. ఇంటింటా జ్వరాలపై ఏఎన్ఎంలు, ఇతర ఆరోగ్య సిబ్బంది సర్వే చేపట్టారు. ఓగు పీహెచ్‌సీ వైద్యులు విజయ్ నేతృత్వంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా పది మందికి జ్వరాలు ఉన్నట్లు నిర్ధారించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని పంచాయతీ కార్యదర్శిని ఎంపీడీవో ఆదేశించారు.



జ్వరంతో మృతి చెందిన వివాహిత

అక్రమ వ్యాపారాలకు విజయానందరెడ్డి కింగ్ పిన్

● వైసీపీ కార్పొరేటర్లు అలీ, కుట్టి రాయల్

చిత్తూరు సిటీ, జూలై 6: వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్చార్జ్ విజయానందరెడ్డి రాజకీయ సన్యాసం తీసుకుంటే మంచిదని ఆ పార్టీ కార్పొరేటర్లు హసైన్ అలీషీ (అలీ, 36వ డివిజన్), కుట్టి రాయల్ (19వ డివిజన్) పేర్కొన్నారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి అంకిత భావంతో పనిచేస్తున్నామన్నారు. ఎలాంటి ఆరోపణలూ లేకుండా పనిచేస్తున్న మమ్మల్ని ఎందుకు సస్పెండ్ చేశారో చెప్పాలని ప్రశ్నించారు. చిత్తూరులో జరిగే అన్ని అక్రమ వ్యాపారాలకు విజయానందరెడ్డే కింగ్ పిన్ అని ఆరోపించారు. సర్పంచ్‌గా కూడా గెలవని విజయానందరెడ్డికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే ఇలాగే ఉంటుందని ఎద్దేవా చేశారు. వైసీపీ కార్యకర్తలపై దాడులు జరిగితే తాను అండగా ఉంటానని మీడియా ముందు చెబుతారని, ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్‌లో ఉంటుందని చెప్పారు. వైసీపీ అధిష్ఠానం విజయానంద రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తే తప్ప చిత్తూరు పార్లమెంటు పరిధిలోని గంగాధర నెల్లూరు, పూతలపట్టు, చిత్తూరు నియోజకవర్గ వైసీపీ క్యాడర్ పార్టీలో నిలిచే పరిస్థితిలేదని అన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్లు అలీ, కుట్టి

25 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 6: నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. గడచిన 24 గంటల్లో 25 మండలాల్లో మోస్తరు వర్షం నమోదైంది. అత్యధికంగా రొంపిచెర్లలో 33.6మి.మీ, అత్యల్పంగా చిత్తూరు రూరల్‌లో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. గంగవరంలో 31.4, తవణంపల్లె 23.2 కార్వేటినగరం 20.2, పులిచెర్ల 20, నగరి 17.8, సోమల, పలమనేరు 14.6, విజయపురం 13.2, పూతలపట్టు 12.6, ఎస్ఆర్ పురం 11.8, వెదురుకుప్పం 9.2, జీడీ నెల్లూరు 8.2, ఐరాల, చిత్తూరు అర్బన్ 7.2, సదుం 5, బంగారుపాళ్యం 5, నింద్ర, చౌడేపల్లె 4.2, పెద్దపంజాణి 2.4, పుంగనూరు 2.2, యాదమరి, పెనుమూరు 2, పాలసముద్రం 1.2 మి.మీ చొప్పున వర్షం కురిసింది.

టీటీడీ నిర్ణయించిన ధరలకే విక్రయించాలి : ఈవో

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు టీటీడీ నిర్ణయించిన ధరలకే వస్తువులను దుకాణదారులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈవో శ్యామలరావు శనివారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించారు. టీటీడీ ఈవో ఆదేశాల మేరకు జేఈవో వీరబ్రహ్మం పర్యవేక్షణలో శనివారం టీటీడీ ఉద్యోగులు భక్తుల తరహాలో శ్రీవారి మెట్టు వద్దనున్న షాప్ నెంబరు3లో గాజు సీసా నీటి బాటిల్ రూ.50 కొనుగోలు చేశారు. అనంతరం ఖాళీ గ్లాస్ బాటిల్ తిరిగి షాపు యజమానికి ఇవ్వగా.. రూ.20 తిరిగి వెనుకకు ఇచ్చారు. వాస్తవంగా రూ.30 తిరిగి ఇవ్వాలి. ఈక్రమంలో అధిక ధరలకు విక్రయిస్తున్నట్టు తేలింది. అలాగే వీరు కొనుగోలు చేసిన దుకాణం ముందు నాణ్యత కలిగిన ప్లాస్టిక్ బాటిల్స్ కూడా నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నట్టు గమనించారు. గతంలో కూడా ఈ షాపు యజమాని వినోద్‌కుమార్ టీటీడీ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తుండటంతో అతడికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, రూ.25 వేలు జరిమానా విధించి హెచ్చరించారు. అయినప్పటికీ అతడు తన ధోరణిని మార్చుకోలేదని, ధరల పట్టిక ప్రదర్శించడం లేదని అధికారులు నివేదిక అందజేశారు. ఈనేపథ్యంలో మరోసారి టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాన్ని సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎర్నెస్ట్ మనీ డిపాజిట్(ఈఎండీ), సెక్యూరిటీ డిపాజిట్(ఎస్‌డీ)లు కూడా జప్తు కాబడతాయని అధికారులు స్పష్టం చేశారు. టీటీడీ నిబంధనలకు విరుద్ధంగా దుకాణదారులు వస్తువులను భక్తులకు అధిక ధరలకు విక్రయించి మోసం చేస్తే, టీటీడీ టెండర్ నిబంధనలను అతిక్రమించినట్టు తెలిస్తే ఆ దుకాణ లైసెన్స్‌ను రద్దు చేస్తామని టీటీడీ హెచ్చరించింది.

టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి

తిరుమల హెల్త్‌ఆఫీసర్‌గా సునీల్‌కుమార్

తిరుమల, జూలై 6 (ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్‌గా విజయలక్ష్మి నియమితులయ్యారు.ప్రస్తుతం ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్న మల్లిఖార్జున పరకామణి ప్రత్యేకాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న క్రమంలో ఆయన్ను పరకామణికి పరిమితం చేశారు.రిటైర్డ్ అధికారిని ఎస్టేట్ ఆఫీసర్ స్థానంలో కొనసాగిస్తున్నారనే విమర్శలొచ్చిన నేపథ్యంలో ఆయన స్థానంలో తిరుపతిలోని శ్వేతలో విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మిని నియమించారు. తిరుమల హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న శ్రీదేవి స్థానంలో తిరుపతిలో అదనపు హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న సునీల్‌కుమార్‌ను నియమించారు. ఇటీవల తిరుమలలో పారిశుధ్య వైఫల్యంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే. టీటీడీ ఈవో శ్యామలరావు కూడా తనిఖీల్లో పారిశుధ్య లోపాన్ని గుర్తించి ఓ అధికారికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తరచూ పరిశుభ్రతపై విమర్శలు వస్తున్న క్రమంలో హెల్త్‌ఆఫీసర్‌గా ఉన్న శ్రీదేవి కూడా బదిలీకోసం వినతిపత్రాన్ని అందజేశారని, ఈ క్రమంలో ఈవో అమోదం తెలపడంతో సునీల్‌కుమార్‌ను నియమించినట్టు సమాచారం.

వ్యాక్సినేషన్‌తో జూనోటిక్ వ్యాధులు దూరం

చిత్తూరు (సెంట్రల్), జూలై 6: జంతువుల నుంచి సంక్రమించే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాక్సినేషన్‌తో వాటిని దూరం చేయవచ్చునని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. జూనోసిస్ డేను పురస్కరించుకుని శనివారం చిత్తూరు పశుసంవర్థక శాఖ-బహువిధ పశువైద్యశాల కార్యాలయంలో పెంపుడు శునకాలకు ఉచిత యాంటీ ర్యాబిస్ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా శునకాలకు 18,500 టీకాలు ఉచితంగా వేసినట్లు చెప్పారు. జేసీ శ్రీనివాసులు, మేయర్ అముద, పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్, వెటర్నరీ డాక్టర్లు పాల్గొన్నారు.



టీకాల శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

న్యాయాధికారులు అవగాహనతో తీర్పులివ్వాలి

● డీజే భీమారావు



న్యాయమూర్తులతో డీజే భీమారావు

చిత్తూరు లీగల్, జూలై 6: భారతీయ న్యాయశాఖ చట్టాలపై న్యాయమూర్తులు పూర్తి అవగాహనతో తీర్పులివ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు కోరారు. జిల్లా కోర్టు ఆవరణలో శనివారం న్యాయశాఖ చట్టాలపై ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిక్రీల అమలు, మనీ డిక్రీ అమలు, వాటి విధివిధానాలు - చట్టం, కేసు నిబంధనల గురించి న్యాయాధికారులు తెలుసుకున్నారు. రీసోర్స్‌పర్సన్లను జిల్లా న్యాయమూర్తి శాలువలతో సన్మానించి, మెమెంటోలతో సత్కరించారు. న్యాయమూర్తులు రమేష్, శాంతి, సునీతారాణి, గురునాథ్, వెన్నెల, రాజగోపాల్, రామచంద్రుడు, అర్చన, శ్రీనివాసులు, విష్ణువర్మ, శ్రీనివాస నాయక్, బేబి రాణి, సత్యకాంత్ కుమార్, కృష్ణప్రియ, విశ్రాంత న్యాయమూర్తులు రాంబాబు, జగన్నాథం, పార్థసారథితో పాటు ఉమ్మడి జిల్లాలోని న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు, విత్తనాల విక్రయ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు

వెదురుకుప్పం, జూలై 6: మండలంలో శనివారం పురుగు మందు, విత్తన విక్రయ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. పచ్చికాపల్లం లోని మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనుమతి లేని ఎరువులను విక్రయించరాదని ఆదేశించారు. అనుమతి లేని గ్రోఫైడ్ ఎరువు 32 కేజీలను గుర్తించారు. ఆత్మ డీపీడీ జి.శివన్నారాయణ, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్, వెదురుకుప్పం వ్యవసాయాధికారిణి వనిత పాల్గొన్నారు.



వ్యవసాయాధికారిణి వనితను వివరాలు అడుగుతున్న అధికారి శివన్నారాయణ

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


విద్యార్థులతో కలసి ర్యాలీ చేస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు రూరల్, జూలై6: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని చంద్రమాకులపల్లె పాఠశాల హెచ్ఎం శ్రీదేవి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని చంద్రమాకులపల్లెలో విద్యార్థులతో కలిసి గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను వ్యవసాయ పనులకు పంపకుండా పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, వెంకట్రమణారెడ్డి, శైలజ, శంకర్‌రెడ్డి, రఘు, మురళీధర్, సుజాత, శేఖర్‌రెడ్డి, లావణ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లేని ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు


ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

పుంగనూరు రూరల్, జూలై6: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నెల్లూరు డీపీడీ శివనారాయణ హెచ్చరించారు. శనివారం పుంగనూరులో ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారకమందుల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల పట్టిక సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాణ్యతలేని మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయించినట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే లైసెన్సులు రద్దు చేసి దుకాణాలను సీజ్ చేసి యజమానిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ చంద్రశేఖర్, ఏవో జ్యోతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై మంత్రి ఆరా

పెద్దపంజాణి, జూలై 6: తీర్థ యాత్రలకు వెళ్లి ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సత్యసాయి జిల్లా నుంచి ఐదు రోజుల పాటు కాణిపాకం నుంచి రామేశ్వరం వరకు పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్ళిన బస్సు పెద్దపంజాణి మండలం బసవరాజుకండ్రిగ సమీపంలో శనివారం ఉదయం ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న మంత్రి ఫోన్ ద్వారా ప్రమాద విషయాలను తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆదుకోవాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని పేర్కొన్నారు.

మొక్కలతోనే మానవ మనుగడ



పలమనేరు, జూలై6 : మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ వెంకటేసులు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఏక్‌పేడ్ మాకా నామ్ అభియాన్ పథకం కింద కళాశాలలో విద్యార్థులు శనివారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షణ్ముగం, అధ్యాపకులు చిదంబరం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేసుబాబు, రవీంద్రనాథరెడ్డి, వృక్ష శాస్త్ర అధ్యాపకులు శశికళ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలే ఆరోగ్య హేతువులు



మొక్క నాటుతున్న బీసీ.నాగరాజ్ తదితరులు

కుప్పం, జూలై 6: మొక్కలు ఈ సమాజానికి ఆరోగ్య హేతువులని బీసీఎన్ విద్యాసంస్థల ఛైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'ఏక్ పేడ్, మాకే నామ్' కార్యక్రమన్ని ఆయన కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. తల్లి పేరుతో మొక్కను నాటారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ తల్లుల పేరుతో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్, సీఈవో సాగర్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, అన్ని విభాగాల అధిపతులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్స్ మాధవన్, గగాధరం, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ తదితరులు సైతం మొక్కలు నాటారు.

పరిసరాల శుభ్రతతో డెంగ్యూ నుంచి రక్షణ


డెంగ్యూపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ దీప

రామకుప్పం, జూలై 6: పరిసరాల శుభ్రత పాటించడం వల్ల డెంగ్యూతో బాటూ పలు వ్యాధులు దరిచేరవని రామకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి దీప తెలిపారు. శనివారం రామకుప్పం బాలుర ఉన్నత పాఠశాలలో డెంగ్యూ జ్వరంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఎక్కువ రోజులు నిల్వ ఉన్న తాగునీటిని వాడరాదన్నారు. దోమతెరలు వినియోగించాలని సూచిం చారు. మూడు రోజులకు మించి జ్వరం ఉంటే తప్పకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్సలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఏఎన్ఎంలు, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో పాల్గొన్న నేతలు, అధికారులు

రామకుప్పం, జూలై 6: స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వ అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె పంచాయతీ మాజీ సర్పంచు సురేష్, టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు మంజునాథ్ కోరారు. చెల్దిగానిపల్లెలో శనివారం నిర్వహించిన గ్రామసమాఖ్య సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం మహిళలకు అన్ని విధాలా అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత మండల ఉపాధ్యక్షుడు రెడ్డిపురుషోత్తం, నేతలు వెంకటాచలం, చంద్రకుమార్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బృందం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు



శాంతిపురం, జులై 6 : మండల పరిధిలోని కర్లగట్ట సమీపంలో కృషి విజ్ఞాన కేంద్ర ఏర్పాటుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థలాన్ని ఎంపికరు. ఆ స్థలాన్ని కేంద్ర బృందం త్వరలో పరిశీలించనుంది. దీంతో మండల వ్యవసాయాధికారులు, మండల ప్రజా ప్రతినిధులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. శనివారం జేసీబీలతో ఆ స్థలంలో చెత్తాచెదారం తొలగించారు. ఆ స్థలంలోకి రోడ్డు వేయించారు. అలాగే చుట్టూ ముళ్ల కంపలు, గుట్టలను తొలగించారు.

పట్టపగలే మహిళ మెడలో చైన్ చోరీ

పుంగనూరు రూరల్, జూలై 6: నడిరోడ్డిపై నడిచి వెళుతున్న ఓ మహిళ మెడలో పట్టపగలే గుర్తు తెలియని దుండగులు ద్విచక్రవాహనంలో వచ్చి బంగారు చైను లాక్కెళ్లిన సంఘటన శనివారం పుంగనూరులో చోటుచేసుకుంది. వివరాలు... పట్టణంలోని సూర్యనగర్‌లో కాపురం ఉన్న హేమ, భర్త రెడ్డెప్ప కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుండేవారు. ఉదయం యథావిధిగా పనులకు వెళ్లడానికి హేమ రోడ్డుపై నడిచి వెళుతుండగా ద్విచక్రవాహనంలో హెల్మెట్లు ధరించిన ఇద్దరు వ్యక్తులు ఆమె మెడలోని బంగారు బొట్టుగొలుసును లాక్కెళ్లారు. ఆమె కేకలు వేసేలోపే పరారయ్యారు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సత్యగంగమ్మ గుడి హుండీ లెక్కింపు

పలమనేరు, జూలై6 : పలమనేరు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని శనివారం ఈవో కమలాకరరావు సమక్షంలో భక్తులు లెక్కించారు. హుండీలో భక్తులు రూ. 2,73,004లు కానుకలు వేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎండోమెంట్ సహాయ కమిషనర్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు పర్యవేక్ష ణలో ఆలయ భక్తులు, ఎండోమెంట్ సిబ్బంది విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పలమనేరు, జూలై6 : పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఉచితనేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ శిబిరంలో చెన్నై శంకరనేత్రాలయ వైద్యులు మురళి పరీక్షలు నిర్వహిస్తారని వివరించారు. ఆపరేషన్లు అవసరమైన వారిని చెన్నై శంకరనేత్రాలయకు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహి స్తారని వెల్లడించారు. ఉచిత వాహన సదుపాయం కల్పిస్తారని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు

బైరెడ్డిపల్లె, జూలై 6 : టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు జన్మదిన వేడుకలను శనివారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. స్థానిక నాలుగురోడ్ల కూడలివద్ద కేక్‌కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, నాయకులు రఘుచంద్ర గుప్తా, భువనచంద్రగౌడు, గోవిందస్వామి, సుబ్రమణ్యంరెడ్డి, రాజేష్, అరుణ్‌గౌడు, పయణి, నాగరాజు, శేషగౌడు, జయచంద్రప్రకాష్, రమేష్, అమరేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తపై దాడి

కుప్పం, జూలై 6: కుప్పం పురపాలక సంఘం కమతమూరు గుండ్లపల్లెలో వైసీపీ కార్యకర్త ఒకరు టీడీపీ కార్యకర్తపై దాడిచేసి గాయపరిచారు. బాధితుడి కథనం మేరకు.. గుండ్లపల్లెలో గల రాములవారి ఆలయ లెక్కలను శనివారం ధర్మకర్తలు, గ్రామ పెద్దలు చూడడానికి సమావేశమయ్యారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి వైసీపీ కార్యకర్త సుభాష్, టీడీపీ కార్యకర్త నాగేంద్రపై దాడిచేసి గాయపరిచాడు. గాయపడిన నాగేంద్రను స్థానికులు చికిత్స నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సూపర్‌బజార్‌కు పర్సన్ ఇన్‌చార్జి నియామకం


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రసాద్

పలమనేరు, జూలై6 : పలమనేరులోని ది బాలాజి కో ఆపరేటివ్ సూపర్‌బజార్‌కు పర్సన్ ఇన్‌చార్జిగా చిత్తూరు సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ టి.ప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆ మేరకు శనివారం సాయంత్రం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

నేడు కళా మందిరం ద్వితీయ వార్షికోత్సవం


ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని ఆహ్వానిస్తున్న తులసినాథం నాయుడు తదితరులు

పలమనేరు, జూలై6 : పలమనేరు సమీపంలోని సాయి గార్డెన్ సిటీలో నిర్మించిన కళామందిరం ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసినాథం నాయుడు, కార్యవర్గసభ్యులు ఆహ్వానించారు. 7వ తేదీ ఉదయం 10 గంటలకు వార్షికోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ వార్షికోత్సవంలో విశిష్ట అతిథిగా చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఆత్మీయ అతిథిగా తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, గౌరవ అతిథిగా ఉమ్మడి చిత్తూరు జిల్లా గత డీఈవో పాండురంగ స్వామి హాజరవుతారని తెలిపారు. ఈ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవలందించిన 18 మందికి పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు.

9న పుంగనూరులో విద్యుత్ అదాలత్

పుంగనూరు, జూలై6: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 9న పుంగనూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు పుంగనూరు డిస్కం ఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల విద్యుత్ వినియోగదారులు వారి విద్యుత్ సమస్యలు తెలియజేయడానికి హాజరు కావచ్చని పేర్కొన్నారు.

చెరువులను కాపాడండి


తహసీల్దార్ శివయ్యకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పుంగనూరు రూరల్, జూలై6: పుంగనూరు మండలంలోని భీమగానిపల్లె పంచాయతీలో ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జా కాకుండా కాపాడాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ శివయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు గంగులప్ప మాట్లాడుతూ కొంతమంది వైసీపీ నాయకులు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులతో కలసి శ్మశానాలు, బండిబాటలు, చెరువులు, పోరంబోకు స్థలాలను ఆక్రమించి విక్రయాలకు సిద్ధం చేశారని ఆరోపించారు. ఆక్రమణల భూముల సర్వే నెంబర్లను తహసీల్దార్‌కు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, ఆంజప్ప, గంగరాజు, రాజేంద్ర, రెడ్డెప్ప, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల స్వాహా.. ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు


ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్, బాధితుడు చంద్రశేఖర్

శాంతిపురం, జులై 6 : మండల పరిధిలోని చెంగుబల్ల గ్రామానికి చెందిన వెంకటేగౌడు ఇంటి నిర్మాణ చెందిన ఉపాధి హామీ బిల్లులను ఫీల్డ్ అసిస్టెంట్ మురుగేష్ స్వాహా చేశాడని మాజీ సర్పంచ్ గోపాల్, వెంకటేగౌడు మనవడు చంద్రశేఖర్ శనివారం ఎంపీడీవో డాక్టర్ మైథిలికి ఫిర్యాదు చేశారు. వెంటేగౌడుకు గత ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి చెందిన కొంత బిల్లులు హౌసింగ్ ఏఈ మం జూరు చేశారు. ఇంటికి ఉపాధి హామీ పథకం ద్వారా రూ.30వేలు మంజూరు కావలసి ఉందని, ఆ బిల్లులు ఇప్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ మురు గేష్‌ను వెంకటేగౌడు కోరాడు. అందుకు సంబంధించిన రికార్డులను వెంకటేగౌడు నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ తీసుకొన్నాడు. రోజులు గడుస్తున్నా బిల్లులు రాలేదని చెబుతూ వచ్చాడు. కొన్నిరోజుల తర్వాత ఉపాధి కార్యాలయంలో విచారణ చేయగా బిల్లులు ఎప్పుడో మంజూరు చేశామని బదులిచ్చారు. ఆ డబ్బులు కూడా తీసుకున్నారని తేలింది. దీనిపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో ఎంపీడీవోను ఆశ్రయించారు. దీంతో విచారణ చేపట్టాలని ఏపీవోను ఎంపీడీవో ఆదేశించారు.

మామిడి తోటలో కాయల చోరీ..పోలీసులకు ఫిర్యాదు

వి.కోట, జూలై 6: వి.కోట మండలం బైరుపల్లెలో ఓ రైతుకు చెందిన మామిడి తోటలో కాయలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఈ ఘటన మూడు రోజుల క్రితం చోటు చేసుకుంది. గ్రామానికి ఉత్తర దిశలో ప్రకాష్ అనే రైతుకు పది ఎకరాలు మామిడి తోట ఉంది. గురువారం సాయంత్రం వరకు తోటకు కాపలా ఉన్న రైతు రాత్రికి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూసేసరికి తోటలో సగానికి పైగా కాయలు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బేనీషా, మల్‌గూబ, నీలం రకాలకు మంచి ధరలు ఉండటంతో ఈ రకంగా చోరీ జరిగినట్లు తెలుస్తోంది. బైరుపల్లె నుంచి వి.కోట మీదుగా వచ్చిన వాహనాలు సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి అర్ధరాత్రి మామిడి కాయల లోడ్లుతో వెళుతున్న ఓ ట్రాక్టర్‌ను గుర్తించారు. ఏడుగురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఓ ట్రాక్టర్ డ్రైవర్, ఏడుగురు కూలీలు కలసి పథకం ప్రకారం ఈ చోరీకి పాల్పడినట్లు తేలింది.

బిడ్డల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాది


విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేస్తున్న చలపతిస్వామి తదితరులు

శాంతిపురం, జులై6: బిడ్డల భివష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాదని రెస్కో మాజీ వైస్ ఛైర్మెన్ చలపతి స్వామి, రాళ్ల బూదుగూరు యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణి అన్నారు. శనివారం మండల పరిధిలోని రాళ్ల బూదుగూరు, తుమ్మిశి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రిని మండల టీడీపీ నాయకులతో కలసి పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు టీడీపీ నాయకులను, మాజీ ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ మంజునాథ్, చలపతి, మాజీ ఎంపీటీసీ రామచంద్రనాయుడు, తుమ్మిశి శేఖర్, నాగరాజు, మంజునాథ్, సింగిరి శ్రీనివాసులు, రాజప్ప, కుమార్, జయరాజ్, ఉపాధ్యాయులు వెంకటేష్, నాగేంద్రిని తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిశ్రమలకు ఉపయోగించాలి


డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న విశ్వనాథనాయుడు, ఇతర నాయకులు

శాంతిపురం, జులై 6: మండల పరిధిలోని కొలమడుగు పంచాయతీ జీడిమానపల్లె గ్రామ రెవిన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 20లో సుమారు 126 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, ఆ భూములను పరిశ్రమలకు వినియోగించాలని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి విజయరామిరెడ్డి, టీడీపీ నేతలు మురుగేష్, ఆనందనాయుడు కోరారు. ఈ మేరకు శనివారం మండల రెవిన్యూ కార్యాలయంలో డీఆర్వో రాజశేఖర్‌ను కలిసి రాతపూర్వకంగా వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా సరిహద్దులు గుర్తించాలన్నారు. చుట్టూ ట్రెంచ్ కొట్టి కంచె వేయాలన్నారు. ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గానికి అనేక పరిశ్రమలు తీసుకురావాలని సంకల్పంతో ఉన్నారని అందువల్ల ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారని సర్వే అధికారులను పిలిపించి తక్షణమే పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారని టీడీపీ నాయకులు తెలియజేశారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి సత్కారం


టీచర్ రమణ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చౌడేపల్లె, జూన్6: ఉపాధ్యాయుడు రమణ సేవలు మరువలేనివి అని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు కడియాల మురళి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీపీ స్కూల్ ఉపాధ్యా యుడు రమణ ఉద్యోగ విర మణ పొందడంతో వారి దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కేశవరెడ్డి, ఉపాధ్యాయులు మదనమోహన్, లింగమూర్తి, సుధాకర్ నాయుడు, జగన్మోహన్, మురళి, పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేయండి



చౌడేపల్లె, జూన్6: తల్లికి వందనం పథకం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మాత్రమే వర్తించేలా చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు మదన్‌మోహన్ కోరారు. శనివారం మండలంలోని పుదిపట్ల హైస్కూల్లో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో నంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. ఎస్టీయూ సభ్యులు లింగమూర్తి, సుధాకర్‌నాయుడు, అంజనేయులు, నారాయణ, శ్రీనివాసులు, సుమిత్ర, భారతి, ఆనంద్, బాలాజి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ ఆలయ ఈవోగా ఏకాంబరం



చౌడేపల్లె, జూన్6: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయ ఈవోగా ఏకాంబరం నియమితులయ్యారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ సత్య నారాయణ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా నూతన ఈవో ఏకాంబరం మాట్లాడుతూ ఇక్కడి ఈవో చంద్రమౌళి గుంటూరుకు బదిలీ కావడంతో తాను శ్రీకాళహస్తి ఆలయం నుంచి ఇక్కడికి వచ్చానని వివరించారు. సోమవారం బాధ్యతలు స్వీకరిస్తానని తెలియజేశారు.

సహకార సంఘాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


పతాకావిష్కరణ చేస్తున్న అధికారులు, నాయకులు

సోమల, జూలై 6: గ్రామాల అభివృద్ధికి సహకార సంఘాలు ఆదర్శంగా నిలిచేందుకు ప్రభుత్వం నిబంధనలను రూపొందించినట్లు సింగిల్ విండో సబ్ డివిజన్ అధికారి రెడ్డెప్ప పేర్కొన్నారు. శనివారం సోమల సింగిల్ విండో కార్యాలయంలో 102వ అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సీఈవో రెడ్డెప్ప, అరీఫుల్లా, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు డాక్టర్ వెంకటేశ్వరరావు, సాంబయ్య, శివశంకర్, మహేంద్రబాబు, చాణుక్య, చెన్న రాయప్ప, నాగరాజ, చంద్రశేఖర్, ధరణీశ్వర్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రొంపిచెర్లజూలై6: రొంపిచెర్లలోని ముత్యాలమ్మ జాతర పురస్కరించుకొని శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు ఆదివారం తెల్లవారుజామున 101 బిందెల పసుపు నీళ్లతో అభిషేకం, మహాభిషేకం, మంగళ హారతులు, ప్రత్యేక పూజలు, రాత్రి పుష్ప పల్లకీ సేవలు జరుగుతాయి.

మాజీ సర్పంచ్ చల్లా హరినాథరెడ్డి మృతి


చిన్నాన్న మృతదేహం వద్ద చల్లాబాబు సంతాపం

రొంపిచెర్ల, జూలై6: బొమ్మయ్యగారిపల్లె మాజీ సర్పంచ్ చల్లాహరినాథరెడ్డి శుక్రవారం తిరుపతిలో మృతిచెందారు. పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హరినాథరెడ్డి చల్లాబాబుకు చిన్నాయన కావడంతో కుటుంబసభ్యులు మాజీ ఎంపీపీ చల్లాప్రేమలతమ్మ, మాజీ సర్పంచ్ చల్లా సుప్రియారెడ్డి, రొంపిచెర్ల మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బొమ్మయ్యగారిపల్లె గ్రామస్థులు ఆయనకు అంజలి ఘటించారు.

చల్లా హరినాథరెడ్డికి నివాళులు

సోమల: చల్లా హరినాథరెడ్డికి సోమల నాయకులు తిరుపతికి వెళ్లి నివాళులర్పించారు. అంజలి ఘటించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి నాయుడు, హరిప్రసాద్, పి.శ్రీనివాసులు, రెడ్డిశేఖర్, శివశంకర్, రఫీ, సతీశ్, దామెదరం, గుర్రప్ప, మణి, శ్రీనివాసులు, శంకర్, మహేంద్రబాబు, చాణుక్య, బాలకృష్ణమనాయుడు తదితరులు నివాళులర్పించారు.

ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న గువ్వల రమేష్‌రెడ్డి

చౌడేపల్లె, జూన్6: ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, ప్రదీప్‌రాజు కోరారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీ వో కార్యాలయంలో టీడీపీ కార్యకర్తలు నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి ఫారం పాండ్లు, కేటిల్ ఫామ్‌షెడ్లు మంజూరైనట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పొగాకు వినియోగిస్తే క్యాన్సర్



చౌడేపల్లె, జూన్6: పొగాకు వినియోగిస్తే క్యాన్సర్ వస్తుందని ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మండలంలోని పుదిపట్లలో పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. సిగరెట్లు, బీడీలు, గుట్కా వంటివి ప్రాణాంతక మని హెచ్చరించారు. పొగ తాగి అనారోగ్యం బారిన పడితే కుటుంబాలు రోడ్డున పడుతాయని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ పొగాకు దూరంగా ఉండాలని కోరారు.

మూగ జీవాలకు ఉచితంగా టీకాలు


సోమలలో టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి చందనప్రియ

కుప్పం, జూలై 6: కుప్పం పెట్‌వేట్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జూనోసిస్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులకు ఉచితంగా టీకాలు, యాంటీ రేబిస్ టీకకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పెట్‌వేట్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వెంకటేశ్, లయన్స్ క్లబ్ రీజన్ ఛైర్మన్ ఎ.మహేశ్, డాక్టర్ శ్రావణ్, డాక్టర్ చంద్రశేఖర్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పీజీ.సెల్వం, చరణ్, సెంథిల్, లెనిన్, లియో క్లబ్ కుప్పం డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్ల: పెంపుడు జంతువుల పట్ల జాగ్రత్తలు పాటించాలని పశువైద్యాధికారి డాక్టరు శ్రీధర్ సూచించారు. మండలంలోని పెంపుడు కుక్కలకు రేబిస్ టీ కాలు వేశారు.

పుంగనూరు రూరల్: జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే ర్యాబిస్ వ్యాధిని నిరోధించడానికి కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్లు పుంగనూరు పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ మనోహర్ తెలిపారు. స్థానిక పశువుల ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు ఉచితంగా టీకాలు వేశారు.

సోమల: సోమల పశుసంవర్ధక కార్యాలయంలో శునకాలకు ఉచితంగా యాంటీ రేబీస్ టీకాలను ఏడీ శ్రీనివాసులు నాయుడు ఆధ్వర్యంలో వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి చందనప్రియ, కార్యదర్శులు వెంకటరమణ, సుధాకర్, నాగభూషణం, చలపతి, మసూద బేగం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కండి: ఎమ్మెల్యే

చిత్తూరు, జూలై 6: పట్టణ అభివృద్ధిలో నగర ప్రజలు, వ్యాపారులు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. శనివారం నగర మేయర్ అముద, జేసీ శ్రీనివాసులుతో కలిసి ఆయన పాత బస్టాండును పరిశీలించారు. అక్కడ పండ్ల వ్యాపారులతో మాట్లాడారు. మంచి వాతావరణంతో పాటు మార్కెట్ శుభ్రంగా ఉండాలని వర్తకులకు సూచించారు. వర్షం వస్తే అడుగు పెట్టలేని స్థితిలో ఉంటే ప్రజలు ఎలా వస్తారని ప్రశ్నించారు. పాత బస్టాండు స్థానంలో కాంప్లెక్సు నిర్మాణం చేపట్టేవరకు పండ్ల వ్యాపారాలు రైతు బజారులో నిర్వహించుకోవాలని సూచించారు. పండ్ల వ్యాపారస్థులు సంఘ నేతలతో మాట్లాడి నిర్ణయం తీసుకోవాలన్నారు. వర్షాకాలం అయినందున డయేరియా, ఇతర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆర్డీవో చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లెమిట్టలో పారిశుధ్య పనులు

శ్రీరంగరాజపురం, జూలై 6: మండలంలో పారిశుధ్యం తీరుపై శనివారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన వార్తకు అధికారులు స్పందించారు. ఎంపీడీవో మోహన్ మురళి, పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ డి.వి. డిల్లెయ్య, అధికారులు కదిలారు. ఎక్స్‌కవేటర్‌తో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిపై మురుగు నీటిని, రోడ్డు ఇరువైపుల ఉన్న చికెన్, వ్యర్థాలను తొలగించారు. వ్యర్థాలను రోడ్డుపై వేసే షాపులను సీజ్ చేస్తామని చికెన్ సెంటర్ల నిర్వాహకులను పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి హెచ్చరించారు.

మురుగునీటి కాల్వల్లో పూడికతీత పనులు

చిత్తూరు, జూలై 6: నగరంలో మురుగునీటి కాలువల్లో పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్టాప్ డయేరియా క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా మేజర్, మైనర్ డ్రైనేజీల్లో యుద్ధప్రాతిపదికన పూడికతీత, శుభ్రత పనులు జరుగుతున్నాయి. కమిషనర్ అరుణ శనివారం పనులను తనిఖీ చేశారు. ఇప్పటి వరకు 9 కిలో మీటర్ల వరకు చేశామని సంబంధిత అధికారులు తెలిపారు. ఎంహెచ్‌వో అనిల్‌కుమార్ నాయక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

గుడిపాల, జూలై 6: నిరుపేదల ఆకలి తీర్చడానికి అన్న క్యాంటీన్లు ఎంతో ఉపయోగపడుతున్నాయని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు పేర్కొన్నారు. శనివారం ఆయన ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అన్నదాన్య కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయదేవ్‌నాయుడు, గురుస్వామి, గోవింద్‌గౌడ్, కిట్టు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య అభివృద్ధికి కృషి

విజయపురం, జూలై 6: ఉమ్మడి చిత్తూరు జిల్లా బ్రాహ్మణ సమాఖ్య ప్రధాన కార్యదర్శి వందవాసి మహేష్‌శర్మను శనివారం ఎన్నుకున్నట్టు ఉమ్మడి చిత్తూరు జిల్లా బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షుడు కాసలనాటి రామ్మూర్తి తెలిపారు. శనివారం ఆయన విజయపురంలో మాట్లాడుతూ బ్రాహ్మణ సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా మాతమ్మ తిరునాళ్ల



విజయపురం, జూలై 6: ఎల్లసముద్రం ఆరుందతివాడలో మాతమ్మ తిరునాళ్లను శనివారం వైభవంగా నిర్వహించారు. వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలకరించి, మాతమ్మ ఆర్చ్‌ను విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేశారు. గెరిగను ఊరేగించారు. ఆదివారం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎంపీ దగ్గుమళ్లకు భారీ స్వాగత ఏర్పాట్లు

చిత్తూరు సిటీ, జూలై 6: ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశాక ఆదివారం చిత్తూరు వస్తున్న దగ్గుమళ్ల ప్రసాదరావుకు కూటమి పార్టీ నేతలు, కార్యకర్తలు భారీగా స్వాగతం పలకనున్నారు. నగరంలో భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆదివారం ఆయన జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో సమావేశమవుతారు. సోమవారం కుప్పం, పలమనేరు, మంగళవారం చిత్తూరు నేతలతో సమావేశమవుతారు. బుధవారం చంద్రగిరి, పూతలపట్టు పార్టీ క్యాడర్‌తో గురువారం చిత్తూరులో అధికారులతో సమావేశమవుతారు.

వరసిద్ధుడిని దర్శించుకున్న ఉన్నతాధికారులు



మిథాలి మధుస్మితకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జూలై 6: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌కం టాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మిథాలి మధుస్మిత, చిత్తూరు,తిరుపతి జిల్లా ఇన్‌కం టాక్స్ కమిషనర్ దుర్గేష్ శనివారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఈవో వెంకటేశు ఆలయ మర్యాదలతో వారిని ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు. తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. స్వామిని టీటీడీ విశ్రాత ఈవో కృష్ణయ్య స్వామిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

మహిళ మెడలో బంగారం చోరీ

చిత్తూరు రూరల్,జూలై 6: నగరంలోని ఓ మహిళ నుంచి 28గ్రాముల బంగారుచైన్ దొంగలు లాక్కునిపోయారు. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం స్థానిక బీవీరెడ్డి కాలనీకి చెందిన శ్రీదేవి శనివారం ద్విచక్ర వాహనంలో బజారుకు బయలుదేరింది. హెల్మెట్ ధరించిర ఇద్దరు దుండగులు బైకుపై పక్కగా వచ్చి ఆమె మెడలోని బంగారు చైన్ బలవంతంగా లాక్కుని పోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేశారు. దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

గాయపడిన వ్యక్తి మృతి



మృతి చెందిన ఏళుమలై

గుడిపాల, జూలై 6: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం కరకంబాడి ఆసుపత్రిల్లో మృతి చెందాడు. ఎస్‌ఐ నరేంద్రకుమార్ కథనం మేరకు వివరాలిలా... తమిళనాడుకు లత్తేరికి చెందిన రామకుమార్, మహదేవన్, ఏళుమలై (52) మరో ఇద్దరు శుక్రవారం ద్విచక్రవాహనంలో వెళుతున్నారు. కిలారిపల్లి సమీపానికి చేరుకోగానే వాహనం అదుపు తప్పడంతో బోల్తా పడ్డారు. ముగ్గురు గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో చిత్తూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో తమిళనాడులోని కరకంబాడి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఏళుమలై శనివారం మృతి చెందాడు.

టీఎన్‌యూఎస్ కార్యవర్గం

యాదమరి, జూలై 6: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) కార్యవర్గాన్ని యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వైఆర్ కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌లను ఎన్నుకున్నారు. సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రజినిబాబు, జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌ల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది.

రైతు బజార్‌లో పూర్తి స్థాయి సదుపాయాలు

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, జేసీ శ్రీనివాసులు

చిత్తూరు (సెంట్రల్), జూలై 6: ఆధునిక సదుపాయాలతో 20 రోజుల్లో చిత్తూరు రైతు బజార్‌ను అందుబాటులో తీసుకురానున్నట్టు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. శనివారం జేసీ శ్రీనివాసులతో కలిసి ఆయన రైతు బజారును పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు దళారుల మధ్యవర్తిత్వం లేకుండా రైతులు విక్రయాలు చేసేందుకు వీలు కల్పించనున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళల స్టాల్స్‌కు సొంత నిధులతో బాడుగ చెల్లిస్తానని హామీ ఇచ్చారు. జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఎలాంటి రుసుము లేకుండా రైతు బజార్లో విక్రయించుకునే సౌలభ్యం కల్పిస్తుమన్నారు. మార్కెటింగ్ ఏడీ పరమేశ్వర్, ఆర్డీవో చిన్నయ్య, డీటీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణలను తొలగిస్తా

చిత్తూరు, జూలై 6: నగరాన్ని ఆనుకుని ఉన్న గంగినేని చెరువు, కట్టమంచి చెరువు, కాజూరు చెరువులను సర్వే చేసి ఆక్రమణలను తొలగిస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. శనివారం పెన్షనర్ల భవనంలో స్మార్ట్‌సిటీపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం నేత నాగరాజు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని తెలిపారు. కలెక్టరేట్ నుంచి ఎంఎస్ఆర్ వరకు, కాజూరు నుంచి దర్గా వరకు, ఎస్టేట్ నుంచి గాంధీ విగ్రహం వరకు వీధిలైట్లను ఏర్పాటు చేసి రోడ్డు మధ్యలో డివైడర్లను ఏర్పాటు చేస్తామన్నారు. వాకర్స్ కోసం ఫారెస్టులో ట్రాక్‌ను ఏర్పాటు చేయాలని జగన్మోహన్‌ను పెన్షనర్లు కోరారు.

హంద్రీనీవా పనులను వేగవంతం చేస్తా



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఐరాల, జూలై 6: నియోజకవర్గంలో హంద్రీనీవా పనులను త్వరలో ప్రారంభించి వేగవంతం చేస్తామని ఎమ్మెల్యే మురళీమోహన్ చెప్పారు. శనివారం ఆయన ఐకే.రెడ్డి పల్లెలో పర్యటించారు. హంద్రీనీవా కాలువ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తాగు,సాగునీటిపై దృష్టి సారిస్తున్నారన్నారు. హంద్రీనీవా పనులు పూర్తి చేసి రాయలసీమను సస్యశ్యామలంగా చేస్తామన్నారు. కొండపై అసంపూర్తిగా ఉన్న శివాలయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, నాయకుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

మామిడి దిగుబడిపై రైతులకు సూచనలు



రైతులకు సూచనలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జూలై 6: మామిడిలో ఎక్కువ దిగుబడి పొందాలంటే రైతులు తోటల్లో చెట్ల మొదళ్లకు గాలి, వెతురు బాగా తగిలేలా చూసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎగువచవట పల్లెలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటల్లో కోతలు అయిపోయిన తోటల్లో, గత ఏడాది కాపు రాని తోటల్లో చెట్ల కత్తిరింపులు చేపట్టాలన్నారు. దీనివల్ల తోటల్లో గత ఏడాది చీడపీడలను నివారించ వచ్చునన్నారు. మందుల పిచికారి ఖర్చు రైతులకు తగ్గుతుందన్నారు. గతేడాది అధిక చిగుర్లు, ఎండిన, అడ్డదిడ్డంగా ఉన్న కొమ్మలు కత్తిరించాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారి సాగరిక రైతులు మార్కొండరెడ్డి,రఘుపతి,జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ కండ్రిగలో తాగునీటి వసతి కల్పిస్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న రామనాథ రెడ్డి

పాలసముద్రం, జూలై 6: ఎస్ఆర్ఆర్ కండ్రిగలో కొత్తగా నిర్మిస్తున్న లేఅవుట్‌లో ఎంపీడీవో రామనాథ రెడ్డి శనివారం పర్యటించారు. తాగునీటి సౌకర్యం కల్పించే అంశాన్ని పరిశీలించారు. కొత్తగా వేసిన బోరునుంచి ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా తాగునీటి సౌకర్యం కల్పిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మండల పరిషత్ నిధుల నుంచి ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆయన వెంట హౌసింగ్ ఏఈ దాము, ఇరిగేషన్ ఏఈ చీరాలయ్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్యామ ప్రసాద్ ముఖర్జీకి నివాళి



చిత్తూరు (సెంట్రల్), జూలై 6: జాతీయవాద రాజకీయవేత్త డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీకి జయంతి సందర్భంగా శనివారం స్థానిక వరదప్ప నాయుడు పాఠశాలలో ఆయన చిత్రపటానికి విద్యార్థులు, బీజేపీ నాయకులు నివాళి అర్పించారు. శ్యామ ప్రసాద్ సేవలను బీజేపీ నాయకులు చిట్టిబాబు వివరించారు. కార్యక్రమంలో బ్రహ్మానందం, పద్మనాభంనాయుడు, శేఖర్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తోనే టీబీ నివారణ



బీసీజీ వ్యాక్సిన్ పోస్టర్ల ఆవిష్కరణ

గంగాధరనెల్లూరు, జూలై 6: ధూమపానం, పొగాకు అలవాటు ఉన్నవారు తప్పనిసరిగా బీసీజీ వ్యాక్సిన్ వేసుకుంటే టీబీ వ్యాధిని నివారించుకోవచ్చని పీహెచ్‌సీ డాక్టర్ పూరిమిట్ల దుర్గాదేవి అన్నారు. పెద్దకాల్వ పంచాయతీ ఎన్‌టీఆర్ కాలనీలోని స్కూల్లో బీసీజీ వ్యాక్సిన్‌పై పలువురు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టీబీ సోకకుండా వృద్ధులు వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. సీహెచ్‌వో శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, ఎఎన్ఎం సుజాత, అంగన్‌వాడీ వర్కర్ సుధారాణి, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు



బంగారుపాళ్యం, జూలై 6: జునోసిస్ దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో డాక్టర్ ఆసిఫ్ సుమారు 80 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. యజమానులు, రైతులకు జునోసిస్ వ్యాధులపై అవగాహన కల్పించారు. నలగాంపల్లి డాక్టర్ వాకాడ ఝాన్సీ, లైవ్‌స్టాక్ అసిస్టెంట్ యాస్మిన్, ఇతర పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత

కార్వేటినగరం, జూలై 6: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరమని డిఎరం పురం అయుర్వేదిక్ వైద్యశాల డాక్టర్ దీపిక తెలిపారు. శనివారం జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా, డయేరియా వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వర్షాకాలంలో పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాల హెచ్ఎం కేశవులు, టీచర్లు పాల్గొన్నారు.

మానవాళి మనుగడకు చెట్లు అవసరం

బంగారుపాళ్యం, జూలై 6: మానవాళి మనుగడకు చెట్లు అవసరమని బంగారుపాళ్యం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వందన త్రిపాఠి తెలిపారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మురళి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సీడీపీవోపై చర్యలు తీసుకోండి

కార్వేటినగరం, జూలై 6: అక్రమాలకు పాల్పడుతున్న స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని జిల్లా అంగన్వాడీ హెల్పర్స్ సంఘం గౌరవాధ్యక్షులు గంగరాజు కోరారు. కార్వేటినగరంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీడీపీవో అంగన్వాడీ వర్కర్ల జీతాల్లో కోత విధించారన్నారు తనిఖీల పేరుతో కార్యకర్తలను బెదిరిస్తున్నారని ఆరోపించారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ

టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు బీఎం రవిని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ శనివారం పరామర్శించారు. వేణుగోపాలపురానికి చెందిన రవి తల్లి బి.చంద్రమ్మ(65) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి, రాజగోపాల్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

తడ, జూలై 6 : గుడిపాల మండలం రామాపురానికి చెందిన కనకం జయచంద్ర (44) రోడ్డు ప్రమాదంలో చనిపోయాడు. క్లీనర్‌గా పనిచేస్తున్న ఇతడు శుక్రవారం లారీలో చెన్నై బయలుదేరాడు. తెల్లవారుజామున పూడి వద్ద టీ కోసం ఆగారు. ఈ సమయంలో లారీ వెనుక వైపు తనిఖీ చేస్తున్నాడు. ఇది గమనించని డ్రైవర్ లారీని స్టార్ట్ చేసి వెనక్కు తీసుకురావడంతో జయచంద్రపై నుంచి వెళ్లింది. జయచంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

యాదమరి, జూలై 6: కాశిరాళ ధర్మరాజులగుడి వద్ద సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కంటికి సంబంధించిన వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు ఇస్తామన్నారు. చెన్నై తిరువట్రియూర్ ఎంఎస్ కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొంటారన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధే సహకార సంఘం ధ్యేయం

గంగాధరనెల్లూరు, జూలై 6: రైతులు అన్ని రంగాల్లో ఆర్థికాభివృద్ధి చెందాలన్నదే సహకార సంఘం ధ్యేయమని సింగిల్‌విండో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి అధికారి శ్రీనివాసులురెడ్డి అన్నారు. సహకార సంఘ దినోత్సవం సందర్భంగా శనివారం సింగిల్‌విండో ఆఫీస్‌లో మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి అధికారులు పూలమాలవేసి నివాళులు అర్పించి సహకార జెండాను ఆవిష్కరించారు. సింగిల్‌విండో సీఈవో విజయకుమార్‌రెడ్డి, డీసీసీబీ బ్రాంచ్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ మహేష్, మేనేజర్ విజయ పాల్గొన్నారు.

నగరి: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సహకారశాఖ విభాగ అధికారి వనజ పతాకావిష్కరణ చేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కేవీఆర్ కుమార్, కోసలనగరం పర్సన్ ఇన్‌చార్జిరమణయ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సులోచన, సీఈఓ తులసిపిళ్లై, అగరం రామకృష్ణ, సుబ్రమణ్యం,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడి హత్యకు నిరసన



అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో హర్తాళ్

నగరి జూలై6: బీఎస్పీ తమిళనాడు అధ్యక్షుడు కె.ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యకు నిరసనగా శనివారం నగరి అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేశాయి. ఆయన హత్య దారుణమని ఆల్ఇండియా అంబేడ్కర్ సంఘం నాయకులు ఎం.కే.ప్రకాష్, ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి గోవిందస్వామి, బీఎస్పీ నాయకులు నాగూర్, విజయ్ రజని జబరాజ్ రాజా అల్లిముత్తు కిరణ్ మహేష్ చిన్నరాజా తదితరులు పాల్గొన్నారు.

వన వేణుగోపాలస్వామికి పాలాభిషేకం

వెదురుకుప్పం, జూలై 6: దేవరగుడిపల్లె-ఆడారెడ్డిపల్లె సమీపంలోని వన వేణుగోపాలస్వామికి శనివారం పాలాభిషేకం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన అర్చకులు కె.కార్తీక్ అయ్యంగార్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అలంకరించారు. క్షీరాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను ఇచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ప్రధాన కార్యనిర్వాహకులు శివకుమార్, సుబ్రహ్మణ్యంరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అనాథ వృద్ధురాలికి 'అమ్మఒడి' అంత్యక్రియలు

చిత్తూరు రూరల్, జూలై 6: నగరంలోని అమ్మఒడి ఆశ్రమంలో అనాథ వృద్ధురాలు సుశీల(90) శనివారం మరణించారు. అమ్మఒడి నిర్వాహకులు కలిసి ఆమెకు సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. అమ్మఒడి ట్రస్టు సభ్యులు పద్మనాభనాయుడు, మధుబాబు, ధనమ్మ, మల్లి, బ్రహ్మాచారి, ప్రకాష్, గణేష్, హెస్సెన్, మధు, లలిత, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధ మహోత్సవం

నగరి జూలై 6: మీరాసాహెబ్‌పాలెంలో శనివారం గంధ మహోత్సవాన్ని ముస్లింలు వైభవంగా జరుపుకొన్నారు. హజరత్ జైనులబ్‌దీన్ బాబా హజరస్ దర్గాలో ఈ వేడుకను స్టార్‌భాయ్, జిలానీభాయ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు హిందూ,ముస్లిం భక్తులకు అన్నదాన చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

అక్రమ గ్రానైట్ లారీ సీజ్

శ్రీరంగరాజపురం, జూలై 6: అక్రమంగా గ్రానైట్ దిమ్మెను తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. స్థానికుల కథనం మేరకు శనివారం రాత్రి కట్టికపల్లె గ్రామ సమీపంలో క్వారీ నుంచి అక్రమంగా గ్రానైట్ దిమ్మెను తరలిస్తున్నారు. తిరుపతి రోడ్డు సమీపంలో గ్రానైట్ లారీను తహసీల్దార్ అల్ఫ్రెడ్ తన సిబ్బందితో కలసి అడ్డుకున్నారు. ఎలాంటి అధారలు లేకపోవడంతో గ్రానైట్ లారీని సీజ్ చేసి, పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అల్ఫ్రెడ్ మాట్లాడుతూ అనుమతి లేకుండా అక్రమంగా గ్రానైట్ దిమ్మెను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.